



19వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 25 ఫిబ్రవరి 2026 పేజీలు 8


బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కనుసన్నల్లోనే..

# గొల్లపాలెంగట్టులో అక్రమ నిర్మాణం



- జి ప్లస్ టుకు పర్మిషన్ కాని అనధికారికంగా మరో అంతస్తు
- వార్డు టౌన్ ప్లానింగ్ సెక్రటరీ నుంచి డీసీపీ దాకా ముడుపులు అందాయంటూ ప్రచారం?
- కనబడి కనబడనట్టుగా టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** బెజవాడలో ఎక్కడ అనధికార నిర్మాణం చేపట్టినా క్షణాల్లోనే వాలిపోయే టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ మధ్యన రూట్ మార్చినట్లున్నారు. పలానా ఎమ్మెల్యే చెప్పారనో పలానా ఎంపి చెప్పారనో లేదా కార్పొరేటర్ రిఫరెన్స్ అని సాకులు చెబుతూ ఉండేవారు. కాని ప్రస్తుతం ట్రెండ్ మార్చి వాళ్ళ పేర్లు చెప్పి టౌన్ ప్లానింగ్ అధికారులే యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా పాతబస్తీలో అనధికార నిర్మాణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం వించిపేటలో ని గొల్లపాలెంగట్టురోడ్డులో భారీ భవన నిర్మాణం జరుగుతుంది.

అయితే భవన యజమాని జి ప్లస్ టు అనుమతి తీసుకొని ప్రస్తుతం జి ప్లస్ త్రీ అనధికారికంగా నిర్మిస్తు న్నారు. అయితే పట్టించుకోవాల్సిన వార్డు ప్లానింగ్ సెక్రటరీ డీల్ మాట్లాడుకోవడంతో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఈ వ్యవహారంపై టౌన్ ప్లానింగ్ ఎసిపి, డిసిపి స్థాయి అధికారులకు ముడుపులు అందాయనే ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే స్లాబ్ వేసినా కూడా అధికారులకు తెలియ లేదంటే ఏ మేరకు పైరవీలు నడిపిస్తున్నారనేది అర్థం అవుతుంది. అధికారుల లీలల వలన కార్పొరేషన్‌కు భారీగా ఆదాయానికి గండిపడితోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చూడాలి ఇప్పటికైనా సిటీ ప్లానర్ గొల్లపాలెంగట్టులోని అనధికార నిర్మాణంపై ఏ మేరకు చర్యలు తీసుకుంటారోనని....

---

లూజ్ మిల్క్ అమ్ముతున్న

## ఔట్లెట్స్‌పై దాడులు



- ఔట్లెట్స్ నుండి 7 శాంపిల్స్‌ని సేకరణ
- పాల నాణ్యత నిర్ధారణ కొరకు హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు తరలింపు
- ఈ రెయిడ్స్ నిరంతరం కొనసాగుతూనే ఉంటాయన్న అధికారులు

2

## రాష్ట్రంలో పశువైద్య వ్యవస్థను బలోపేతం చేయాలి

ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

వివరాలు 2లో...




జక్కంపూడి పంచాయితీలో...

## ఇంటి పన్నుల స్కాం

- గత పంచాయితీ కార్యదర్శి అవినీతి లీలలు?
- ప్రభుత్వ పట్టా అమ్మేసినా కొన్న వ్యక్తి పేరుమీద పన్ను ఇచ్చిన వైనం
- కూటమి ప్రభుత్వం రాగానే ఖాళీ స్థలాలపై కన్నేసిన కబ్జారాయుళ్ళు
- కలెక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు...
- జక్కంపూడి గత పంచాయితీ కార్యదర్శిపై విచారణకు ఆదేశం

2 లో

భక్తి వైభవం, వైదిక ఘనతలతో

## కుంభాభిషేకం



- మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక ఆధ్యాత్మిక మహోత్సవం
- 12 ఏళ్లకోసారి జరిగే కుంభాభిషేకం నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు
- దేశ విదేశాల నుంచి లక్షలాది భక్తులు వస్తారని అంచనా
- ఎక్కడా ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా సౌకర్యాలు
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**ఇంద్రకీలాద్రి, మేజర్ న్యూస్ :** శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా కుంభాభిషేక హోత్సవం జరగనుందని.. ఆగమ శాస్త్రం ప్రకారం 12 ఏళ్లకోసారి ఆలయంలోని దైవిక శక్తి పునరుద్ధరణకు కుంభాభిషేకం మహోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందని, ఇందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కుంభాభిషేక మహోత్సవం-2026 నిర్వహణపై ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈవో వీకే శీనా నాయక్ తదితరులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర

మిగతా 2లో

## రాష్ట్రంలో పశువైద్య వ్యవస్థను బలోపేతం చేయాలి

**మండలానికి ఒక పశువైద్యశాల ఏర్పాటు చేయాలి**

**చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి పశు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి**

**వెటర్నరీ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకురావాలి**

**ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ**



**గన్నవరం, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పశు సంవర్ధక శాఖ పనితీరు పశువుల సంరక్షణపై సుదీర్ఘంగా మాట్లాడారు. రాష్ట్రంలో వెటర్నరీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని, బ్రిటిష్ కాలంలో బాగున్న ఈ వ్యవస్థ కాలక్రమేణా ప్రాధాన్యతలు మారి బలహీనపడిందని ఆయన ఆవదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, కేవలం గోపాల మిత్రలు, పారామెడికల్ టీమ్‌లతోనే వ్యవస్థ నడుస్తోందని పేర్కొన్నారు. ప్రతి మండలానికి ఒక పశువైద్యశాలను ఏర్పాటు చేసి, తగినంత మంది డాక్టర్లను నియమించకపోతే భవిష్యత్తులో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గన్నవరం ఎయిర్‌పోర్ట్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ భవన ప్రహరీ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, విదేశీ ప్రతినిధులు వచ్చినప్పుడు అది మన రాష్ట్ర పరువు తీసేలా ఉందని విమర్శించారు. గత సమావేశాల్లో మంత్రి హామీ ఇచ్చినట్లుగా, వెంటనే నిధులు కేటాయించి ఆ ఆసుపత్రిని ఆధునీకరించాలని కోరారు. 2019-24 మధ్య కాలంలో పశు సంవర్ధక శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ఆ సమయంలో స్థానిక నేతలు, కొందరు అధికారులు, పోలీసుల అండతో ఒంగోలు గిత్తలు, ఆవులను అక్రమంగా కలకత్తా మీదుగా బంగ్లాదేశ్‌కు తరలించారని ఆరోపించారు. లక్షలాది రూపాయల విలువైన పశువులను తక్కువ ధరకే కొనుగోలు చేసి అక్రమ రవాణాకు పాల్పడ్డారని, దీనివల్ల రాష్ట్రంలో పశు సంపద తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే చెక్ పోస్టులను బలోపేతం చేసి, పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని, వెటర్నరీ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకురావాలని యార్లగడ్డ వెంకట్రావు సభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

## లూజ్ మిల్క్ అమ్ముతున్న ఔట్లెట్స్‌పై దాడులు

**ఔట్లెట్స్ నుండి 7 శాంపిల్స్ ని సేకరణ**

**పాల నాణ్యత నిర్ధారణ కొరకు హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు తరలింపు**

**ఈ రెయిడ్స్ నిరంతరం కొనసాగుతూనే ఉంటాయన్న అధికారులు**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** రాజమండ్రిలో ఇటీవల జరిగిన దుర్ఘటన దృష్ట్యా, గౌరవ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి ఆదేశానుసారం మంగళవారం విజయవాడ పట్టణంలో లూజ్ మిల్క్ అమ్ముతున్న వివిధ అవుట్ లెట్స్ పై అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వారితో కలిసి దాడులు నిర్వహించడం జరిగింది. విజయవాడలోని కృష్ణలంక, పంటకాలువ రోడ్డు, కరెన్సీ నగర్, ప్రసాదంపాడు, గురునానక్ కాలనీ తదితర ప్రాంతల్లో తనిఖీలు చేశారు. ఔట్లెట్స్ నుండి 7 శాంపిల్స్ ని సేకరించటం జరిగింది. ఈ శాంపుల్స్ ని పాల నాణ్యత నిర్ధారణ కొరకు హైదరాబాదులోని విమ్టా ప్రయోగశాలకు పంపించడం జరుగుతుంది. ఈ రెయిడ్స్ నిరంతరంగా జిల్లాలో కొనసాగుతూనే ఉంటాయి. పాలలో జరిగే వివిధ కల్తీలకు సంబంధించి కొన్ని చిట్కాలను పాటించవలసిందిగా వినియోగదారులకు సూచిస్తున్నాం పాలు బాగా చిక్కగా ఉండటానికి పాలలో పిండిని కలపటానికి అవకాశం ఉన్నది. దీనిని తెలుసుకొనుటకుగాను కొద్దిగా పాల శాంపుల్ తీసుకొని దీనిలో రెండు చుక్కలు అయోడిన్ ని వేసినట్లయితే పాలు నీలి రంగు లోకి మారుతాయి. పాలల్లో అధిక వెన్న శాతం కొరకు వెజిటబుల్ నూనెలను కలుపుతారు. పాలు జిడ్డుగా ఉన్నట్లయితే దీనిని అనుమానించవచ్చు. పాలు చేదుగా ఉన్నా, దుర్గంధంతో ఉన్నా అటువంటి పాలను వినియోగించరాదు. స్వచ్ఛమైన పాలు త్వరగా చెడిపోతాయి. పాలు ఎక్కువసేపు చెడిపోకుండా నిల్వ ఉన్నాయంటే వాటిలో హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి కెమికల్స్ ని వాడినట్లుగా అనుమానించాలి. పాల కల్తీపై మీకు అనుమానం ఉన్నట్లయితే ఫుడ్ సేఫ్టీ వారికి కానీ, పశుసంవర్ధక శాఖ వారికి కానీ తెలియపరచినట్లయితే ఆ పాల శాంపిల్స్ సేకరించి, కల్తీ పాలుగా తేలినట్లయితే నిర్ధారణ అయినట్లయితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడును. పాలను ప్లాస్టిక్ లేదా అల్యూమినియం క్యాన్లలో రవాణా చేయరాదు. కేవలం స్టెయిన్లెస్ స్టీల్ క్యాన్లలో మాత్రమే రవాణా చేయాలి. లూజ్ పాలు అమ్మే వారు పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

# భక్తి వైభవం, వైదిక ఘనతలతో కుంభాభిషేకం



(మొదటిపేజీ తరువాయి)

సరస్వతి స్వామి వారి చేతులమీదుగా కనకదుర్గమ్మ ప్రధాన ఆలయ శిఖర విమానగోపురానికి అభిమంత్రించిన అనేక పుష్కర మహా జీవనదులు, సముద్రోదకములతో కుంభాభిషేకం జరుగుతుందని వివరించారు. మహోత్సవానికి గౌరవ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి హాజరవుతారన్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో వైదిక క్రతువులు జరుగుతాయని.. దేశ విదేశాల నుంచి లక్షలాది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు సమన్వయ శాఖల అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాలతో పాటు అనేక కార్యక్రమాలను చిన్న ఇబ్బంది కూడా లేకుండా విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా అధికారులు, ఆలయ అధికారులు కృషిచేశారని.. ఇదేవిధంగా మున్ముందు కూడా కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు.

**సామాన్య భక్తులకు పెద్దపీట: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

కుంభాభిషేకం హోత్సవాల సమయంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేయనున్నామని.. మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. టీమ్ ఎన్‌టీఆర్ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, గౌరవ ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో ఆధ్యాత్మిక మహా కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రమాణాలతో ఏర్పాట్లు చేస్తున్నామని.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. దసరా సమయంలో రోజుకి రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా చూశామని.. ఇప్పుడు రోజుకు మూడు లక్షల మంది వచ్చినా ఇబ్బంది లేకుండా పూర్తి సన్నద్ధతతో రాజీలేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

**భక్తుల భద్రతకు భరోసా: సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు**

భక్తుల భద్రతకు భరోసా కల్పిస్తూ పటిష్ట బందోబస్తుకు ఏర్పాట్లు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు తెలిపారు. ఏటా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోందని.. కుంభాభిషేక మహోత్సవానికి కూడా లక్షలాదిమంది భక్తుల హాజరవుతారని అంచనా వేస్తున్నామని.. ఇందుకు తగ్గట్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

**ఆలయ ప్రధాన అర్చకులు లింగంభొట్ల దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు షణ్ముకశాస్త్రి**

కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాల గురించి వివరించారు. భారతదేశంలోని పుణ్య నదులు, తీర్థాలు, సప్త సముద్రాల జలాలను కలశాలలో ఉంచి, యాగశాలలో మంత్రయుక్తంగా పూజించిన తర్వాత వైదికంగా చేసే అభిషేకమే కుంభాభిషేకమని వివరించారు. మార్చి 6న యాగశాలలో ఉదయం 8 గంటల నుండి యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహ వాచనం, దీక్షాధారణ, పంచగవ్య ప్రాశనం, అఖండ దీపారాధన, మధ్యాహ్నం 12 గంటలకు అంకురార్పణ. సాయంత్రం 4 గంటల నుండి అగ్నిప్రతిష్టాపన, మూలమంత్ర హవనములు, హారతి, రాత్రి 7 గంటలకు మంత్రపుష్పము ఉంటుందన్నారు. అదేవిధంగా ఏడో తేదీన యాగశాలలో ఉదయం 8 గంటల నుండి వివిధ పవిత్ర నదీ, సముద్ర జలాలతో అష్టోత్తర కలశస్థాపన, పూజ, పీఠ పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు మూలమంత్ర హవనములు. సాయంత్రం 4 గంటల నుండి మూలమంత్రహవనములు, ప్రదోషకాల పీఠపూజలు, హారతి, రాత్రి 7 గంటలకు మంత్రపుష్పము ఉంటుందని వివరించారు. 8వ తేదీన యాగశాలలో ఉదయం 7 గంటల నుండి మంటప పూజలు, మూలమంత్ర హవనములు, ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి. ఉదయం 9:34 నిమిషములకు మేషలగ్నంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రధాన ఆలయ ప్రాంగణంలో కుంభాభిషేకం జరుగుతుందని తెలిపారు. కుంభాభిషేకం అనంతరం రాజగోపురం ప్రాంగణంలో కళావేదికపై శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారి అనుగ్రహ భాషణం ఉంటుందని తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయికి అర్హత సాధించిన క్రీడాకారిణి సునంద జిల్లాకే గర్వకారణం





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జాతీయ స్థాయిలో విజయం సాధించి అంతర్జాతీయ స్థాయికి అర్హత సాధించిన క్రీడాకారిణి సునంద జిల్లాకే గర్వకారణం అని కృష్ణా జిల్లా కలెక్టర్ డికె బాలాజీ పేర్కొన్నారు. మచిలీపట్నానికి చెందిన యోగా సభ్యురాలు సిహెచ్. సునంద ఇటీవల మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ లో జరిగిన 45 వ జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలలో పాల్గొని మూడవ స్థానం దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నగరంలోని గాంధీ నగర్ లో గల ఉదయపు నడక మిత్రమండలి భవనంలో ఏపీ యోగాసభ వారిచే నిర్వహిస్తున్న యోగా తరగతుల అనంతరం జిల్లా కలెక్టర్ క్రీడాకారిణి సునందను అభినందించి, ఘనంగా సత్కరించారు. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని, పతకాన్ని ఆమె స్వీకరించారు. ద ఈ సందర్భంగా కలెక్టర్ డీ కే బాలాజీ మాట్లాడుతూ, మచిలీపట్నం ముఖ్యంగా యోగా సంస్థ ఎపి యోగ సభలి నుంచి , ఒక మహిళ విదేశాల్లో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించడం హర్షణీయం అని అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించి మచిలీపట్నానికి, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకుని రావాలని కలెక్టర్ అభిలషించారు. కలెక్టర్ తండ్రి అయిన కృష్ణయ్య శెట్టి మాట్లాడుతూ నిరంతర కృషితో అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. యోగా గురువులు గురునాధబాబు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. యోగా సభ్యులు అందరూ హర్షధ్వానాలతో సునందను అభినందించారు.

# జక్కంపూడి పంచాయితీలో ఇంటి పన్నుల స్కాం

**గత పంచాయితీ కార్యదర్శి అవినీతి లీలలు?**

**ప్రభుత్వ పట్టా అమ్మేసినా కొన్న వ్యక్తి పేరుమీద పన్ను ఇచ్చిన వైనం**

**కూటమి ప్రభుత్వం రాగానే ఖాళీ స్థలాలపై కన్నేసిన కబ్జారాయుళ్ళు**

**కలెక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు...**

**జక్కంపూడి గత పంచాయితీ కార్యదర్శిపై విచారణకు ఆదేశం**

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** వడ్డించేవాడు మనవాడైతే ఏ వరుసలో కూర్చుంటే ఏముంది అన్నట్లుగా ఏ స్థలం కబ్జా చేసినా ఇంటి పన్ను ఇచ్చే అధికారి ఉంటే ఇంకేముంది...సగం స్థలం లాగేసుకున్నట్లే...ఇది విజయవాడ రూరల్‌లో పరిపాటిగా మారింది. స్థలం ఆక్రమించడం ఇంటి పన్ను ఇచ్చేయడం ఆ వ్యక్తి నాదే అని అసలు ఓనర్లను బెదిరించి గెంటేయడం...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖాళీ స్థలాలపై కొంతమంది కేటుగాళ్లు కన్నేశారన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం జక్కంపూడి లో వ్యవహారం వెలుగులోకి రావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళితే విజయవాడ రూరల్ మండలంలోని జక్కంపూడి లో ఇంటిపన్నుల స్కాం వెలుగులోకి వచ్చింది. ఇంటి స్థలం ఒకరి పేరు మీద ఉంది..కరెంటు బిల్లు అతని పేరు మీదే ఉంది..కాని ఇంటి పన్ను మాత్రం వేరే వాళ్ళ పేరు మీద ఇవ్వడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా స్థలానికి పట్టా ఇచ్చినప్పుడు అది అమ్మడం కొనడం నేరం. పట్టా వెనుక ఈ కండీషన్ ఉంటుంది. కాని కబ్జా రాయుళ్ళు నకిలీ పత్రాలు సృష్టించి ఇంటి పన్నుల కోసం అప్లై చేస్తుండడం ఆ తర్వాత ఎటువంటి నియమ నిబంధనలు చూడకుండానే కబ్జా రాయుళ్ళ పేరు మీద పంచాయతీ కార్యదర్శి పన్నులు ఇచ్చేస్తున్న భాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాని పన్నులు ఇచ్చే సమయంలో అది ఎవరి పట్టా ఎవరు హక్కు దారుడు అమ్మినంతమాత్రాన దానిలో ఉన్న కండీషన్లు ఏంటి అవన్నీ చూసుకోకుండానే పట్టా ఇచ్చేస్తారా...టరమ్స్ కండీషన్స్ లో వాళ్ళకు సంబంధించిన పేజీలు మిస్ చేసినా పంచాయితీ సెక్రటరీ ని తప్పుదోవ పట్టించినా పంచాయితీ కార్యదర్శి గుడ్డిగా ఇంటి పన్ను ఇవ్వడంతో అసలు యజమానులు రోడ్డున పడే పరిస్థితి తలెత్తుతుందంట. తీరా మోసపోయిన వ్యక్తి ఫిర్యాదు చేస్తే ఇంటి పన్ను రద్దు చేయమంటారా అని అడగడం అధికారులు తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకే పన్నుల స్కాం బయటకు రాకూడదనే జాగ్రత్తలు పడుతున్నారనే ప్రచారం జరుగుతుంది. అయితే పంచాయితీ కార్యదర్శి పన్నుల జారీ అంశంపై పెద్ద ఎత్తున ముడుపులు అందాయనే ప్రచారం జరుగుతుంది. అందుకే అంత అడ్డగోలుగా పన్నులు ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బాధితులు కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. చూడాలి కలెక్టర్ లక్ష్మీశ విచారణలో ఇంకెన్ని ఇంటి పన్నుల స్కాం కు సంబంధించిన వ్యవహారాలు బయటపడుతాయోనని.

# 'వాచ్ అవుట్ ఫర్ అజ్'తో ఆశయం యొక్క కథను చెబుతున్న సోనాట







**విజయవాడ, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** హీరోలను వారు ఎక్కడి నుండి వచ్చారో కాదు, వారు ఎంత దూరం వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారనే దాని ద్వారా నిర్వచిస్తారు. లక్ష్యం, వేగం, ఆత్మవిశ్వాసంతో నడిచే తరాన్ని సోనాట యొక్క కొత్త బ్రాండ్ ఫిల్మ్, వాచ్ అవుట్ ఫర్ అజ్ వేడుక జరుపుకుంటుంది. వారు పట్టుదలతో పరిస్థితులకు అనుగుణంగా మారతారు, అభివృద్ధి చెందాలనే తిరుగులేని ఆకాంక్షను కలిగి ఉంటారు. వారికి, శైలి అనేది వారు ఈ ప్రపంచంలో ఎలా జీవిస్తారనే దానికి ఒక ఉదాహరణ. కృషి,పట్టుదలతో తమ సొంత మార్గాన్ని నిర్మించుకునే వారిని సోనాటా అభినందిస్తుంది. వాచ్ అవుట్ ఫర్ అజ్ అనేది యువ భారతదేశం యొక్క లయకు అనుగుణంగా కదిలే బ్రాండ్‌గా సోనాట యొక్క తదుపరి అధ్యాయాన్ని సూచిస్తుంది. ఈ చిత్రం ధ్రువీకరణ లేదా అనుమతి కోసం వేచి ఉండటానికి నిరాకరించే మనస్తత్వాన్ని ఒడిసిపడుతుంది. ఇది ఉద్దేశ్యంతో ముందుకు సాగే, తమ సొంత నిబంధనల ప్రకారం తమ కంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకునే,, ప్రశంసలతో కాకుండా వ్యక్తిగత మైలురాళ్లతో పురోగతిని కొలిచే ఒక తరాన్ని ప్రతిబింబిస్తుంది. ఆ గడియారం నిర్ణయాలు తీసుకునే, మార్పులు జరిగే క్షణాలలో తోడుగా ఉండే ఒక స్థిరమైన సహచరునిగా మారుతుంది. ఈ ప్రచారంలో అత్యంత కీలకంగా ముగ్గురు లక్ష్య సాధకుల ప్రయాణాలను అనుసరించే ఒక శక్తివంతమైన చిత్రం ఉంది, ప్రతి ఒక్కరూ తమ స్వంత కలలు, పోరాటాలు, మైలురాళ్లను అన్వేషిస్తుంటారు. రాప్-శైలి కథనంతో రూపొందించబడిన ఈ చిత్రం నిజాయితీ, లయను తెర పైకి తెస్తుంది, యువ భారతదేశ నాడిని ప్రతిబింబిస్తుంది. టైటాన్ కంపెనీలో అనలాగ్ వాచీల చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రంజని కృష్ణస్వామి మాట్లాడుతూ, "గత సంవత్సర కాలంగా, గొప్పవారిగా కీర్తించబడాలనే కోరిక, ఆత్మవిశ్వాసం, సంప్రదాయాలను సవాలు చేయడానికి వెనుకాడని కొత్త తరం వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఉండటానికి సోనాటా సంస్థ నిలకడగా అభివృద్ధి చెందుతోంది. విలువ-ఆధారిత ఫ్యాషన్ వాచ్ బ్రాండ్‌గా, మా వ్యూహం ఔచిత్యం, అవకాశాలు, ఆకాంక్షపై ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందుతున్న సాధకుల సాంస్కృతిక ప్రేరణలను ప్రతిబింబించడమే కాకుండా వారి ప్రయాణాలకు వీలు కల్పించే బ్రాండ్‌ను నిర్మించడం, భారతదేశపు వినియోగదారుల తదుపరి దశ వృద్ధికి సోనాటాను విశ్వసనీయమైన, సమకాలీన ఎంపికగా ఉంచడం పై మేము దృష్టి సారించాము" అని అన్నారు.




## టైర్ల మార్కెట్‌లోకి బాలకృష్ణ ఇండస్ట్రీస్ లిమిటెడ్

**విజయవాడ, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** ఆఫ్ హైవే టైర్ విభాగంలో ప్రపంచ అగ్రగామి అయిన బాలకృష్ణ ఇండస్ట్రీస్ లిమిటెడ్, తన ఆన్ హైవే పోర్ట్‌ఫోలియోను అందుబాటులోకి తీసుకువచ్చి భారతదేశ వినియోగదారుల టైర్ల మార్కెట్‌లోమైలురాయిగా నిలిచే తన ప్రవేశాన్ని ప్రకటించింది. దాని ఆఫ్ హైవే టైర్ నాయకత్వానికి ఆవల వ్యూహాత్మక విస్తరణను సూచిస్తూ, బాలకృష్ణ ఇండస్ట్రీస్ లిమిటెడ్ టూ వీలర్లు, మీడియం, హెవీ వాణిజ్య వాహనాలు కోసం పర్పస్ బిల్ట్ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇది భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వినియోగదారు, భర్తీ టైర్ విభాగాలకు దాని దీర్ఘకాలిక నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఇదే సమయంలో కంపెనీ 'ఎలివేట్ యువర్ డ్రైవ్' అనే జాతీయ బ్రాండ్ ప్రచారాన్ని ప్రారంభించింది. దీనిలో బ్రాండ్ ప్రచారకర్త రణవీర్ సింగ్‌తో కలిసి తన వినియోగదారుల వద్దకు బ్రాండ్ ప్రయాణాన్ని తీసుకువెళుతూ, స్వదేశీ ప్రపంచ టైర్ తయారీదారుకు కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది.

## పాలిటెక్నిక్ విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రులోని టికెఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు స్థానిక ఎస్సై- 2 జి.విజయభాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం, లైంగిక వేధింపుల నుండి పిల్లల రక్షణ తదితర చట్టాల గురించి వారికి వివరించారు. అలాగే మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే నష్టం, సైబర్ మోసాలు జరిగే విధానం- వాటి నుండి బయటపడే మార్గం, రహదారి భద్రత, పిల్లల రక్షణ తదితర విషయాలపై విద్యార్థులకు ఎస్ఐ విజయభాస్కర్ అవగాహన కల్పించారు.

## రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన



**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి -65 బల్లిపర్రు సెంటర్ (బ్లాక్ స్పాట్) వద్ద హెల్మెట్ వినియోగం, రోడ్డు భద్రతపై స్థానిక ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ ఎస్ఐ -2 జి.విజయభాస్కర్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు హేతువని పేర్కొన్నారు. ప్రమాదాలకు కారణమయ్యే నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. బ్లాక్ స్పాట్ ప్రాంతంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్ నియమాలు ఖచ్చితంగా పాటించాలని పోలీస్ అధికారులు సూచించారు.

## భవిత సెంటర్‌ను సందర్శించిన జిల్లా ఐఈ కోఆర్డినేటర్



**రెడ్డిగూడెం, మేజర్ న్యూస్ :** రెడ్డిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో గల భవిత సెంటర్ ను జిల్లా ఐ ఈ కోఆర్డినేటర్ కె నారాయణ మంగళవారం సందర్శించారు. భవిత సెంటర్లో గల రికార్డులు పరిశీలన, ఫిజియోథెరపీ క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ భవిత సెంటర్లో జరుగు కార్యక్రమాల్లో ఉపయోగాలను వివరిస్తూ క్రమం తప్పకుండా పిల్లలను భవిత సెంటర్‌కు తీసుకొని రాగలరని తల్లిదండ్రులను కోరారు. భవిత సెంటర్ ఐఆర్టి టీచర్స్‌లకు ఫిజియోథెరపీ డాక్టర్లకు కొన్ని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల తల్లిదండ్రులు, టీచర్స్ పాల్గొన్నారు.



## నిత్యాన్నదానం పథకానికి హైదరాబాద్ భక్తుల విరాళం

**మోపిదేవి మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిత్యాన్నదానం పథకానికి హైదరాబాద్ భక్తులు విరాళం అందచేశారు. మంగళవారం దేవస్థానం కార్యాలయంలో కల్పటపు శేష సాయి, అడవి రాధాకృష్ణ మూర్తి, రమాదేవి, ప్రసాద్ పేరుమీద రూ.లక్ష, కల్పటపు కామేశ్వరరావు, అన్నపూర్ణమ్మ, బాల సూర్యనారాయణ మూర్తి జ్ఞాపకార్థం రూ.లక్ష, కల్పటపు వీరభద్రయ్య, శేషమ్మ జ్ఞాపకార్థం రూ.లక్ష మొత్తం రూ.మూడు లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో దేవస్థానం సూపరింటెండెంట్ అచ్యుత మధుసూధన రావుకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## నిత్యాన్నదాన పథకానికి గుంటూరు భక్తుల విరాళం



**మోపిదేవి మేజర్ న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి గుంటూరు భక్తులు విరాళం అందచేశారు. చెన్నంశెట్టి వెంకటేశ్వరరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,02,555లు చెక్కు రూపంలో దేవస్థానం సూపరింటెండెంట్ అచ్యుత మధుసూధనరావుకు అందచేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## అకాల వర్షంతో వేల కోట్లు నష్టపోయిన ఇటుకబట్టి యాజమాన్యం



**జి.కొండూరు మేజర్ న్యూస్:** జి కొండూరు మండల పరిషత్ ప్రాంతాల్లో రాత్రి కురిసిన వర్షానికి కుదేలైన ఇటుక బట్టీ నిర్వాహకులు వర్షపు నీటిలో తడిచి పాడైన లక్షల ఇటుకలు,అకాల వర్షానికి ఆకారాన్ని కోల్పోయిన ఇటుకలుమైలవరం జి కొండూరు పరిసర ప్రాంతాల్లో కోట్ల రూపాయల నష్టాన్ని చవిచూసిన ఇటుక బట్టి యజమానులు గత సంవత్సరంలో వరదల కారణంగా కోట్లలో అప్పులు చేసి బంగారం ఆడవారి పుస్తేలు తాకట్టు పెట్టి ఇటుక బట్టీల యజమానులు చేరుకోకముందే రాత్రి కురిసిన వర్షంతో కోట్లలో నష్టపోయారని వారు ఆవేదన చెందుతున్నారు ఇటుక బట్టీలను చిన్న తరహా పరిశ్రమలుగా ప్రభుత్వం గుర్తించి తమని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఇటుక బట్టీ నిర్వాహకుల వేడుకుంటున్నారు వీటి ద్వారా వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని వారంతా నిర్భాగ్యులుగా మారిపోయే అవకాశం ఉందని ఇటికబట్టి యాజమాన్యం ఆవేదన చెందుతున్నారు చిన్న చిన్న ఇటుక బట్టీలు యజమానులు తమ ఇళ్ళను తాకట్టుపెట్టి ఈ వ్యాపారంలో దిగామనే ప్రస్తుతం కురిసిన వర్షం కారణంగా మూత వేసుకొని కూలి పనికి వెళ్లాల్సిందేనని వారు ఆవేదన చెందుతున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నారా లోకేష్‌లు ఇటుక బట్టీల యాజమాన్యంపై దృష్టి పెట్టి ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.



## జూలైలో తెలుగు రచయిత్రుల మహాసభలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** తెలుగు రచయిత్రుల మహా సభలను జూలై 11, 12వ తేదీల్లో ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలి వెంకట కష్ణారావు శత జయంతి, 2000 మిలీనియం రజతోత్సవం, యాబదేళ్ళ క్రితం బందరులో నిర్వహించిన రచయిత్రుల మహాసభల స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని తెలుగు రచయిత్రుల మహాసభలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. విజయవాడ కె బి యన్ కళాశాలలో ఈ మహాసభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గత పాతికేళ్ల కాలంలో తెలుగు భాషా సాహిత్యాల ప్రగతి, రానున్న పాతిక సంవత్సరాల్లో భాష, సాహిత్యం, సంస్కృతి, వివిధ సామాజిక అంశాలపై ఒక ప్రణాళిక గురించి చర్చా గోష్ఠులు, కవి సమ్మేళనాలు, రచయిత్రులు, పరిశోధకులు, పాత్రికేయ మహిళలతో ప్రత్యేక సదస్సులు, సాంస్కతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రాంతాలకు, వర్గాలకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు రచయిత్రులు, ఉద్యోగినులు, ఉపాధ్యాయినులు, ఉన్నత అధికారిణులు, మహిళా పారిశ్రామిక వేత్తలు వివిధ సంఘాల్లో కీలక పాత్ర వహిస్తున్న మహిళలందరికీ ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఈ మహాసభలలో మహిళలతో పాటు పురుషులు కూడా ఆహ్వానితులేనని, అయితే వేదికలపై మహిళలకు మాత్రమే అవకాశాలుంటాయని తెలిపారు. ప్రతినిధి రుసుము రూ.300 అని చెప్పారు. 2026 ఏప్రియల్ 30వ తేదీలోగా నమోదైన రచయిత్రులకే వేదికపైన అవకాశం ఉంటుందన్నారు. 9391238390 నంబరు ద్వారా చెల్లింపులు చేస్తూ... తమ వివరాలను తెలియచేయవలసిందిగా కోరారు. వివరాల కొరకు ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు 94401 67697, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్ 94401 72642 సంప్రదించవచ్చునని వివరించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

### పాల్గొన్న బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పివీ ఫణి కుమార్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో చేయూత అందించడానికి దోహదపడుతుందని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ అన్నారు.నగర కార్పొరేషన్ 47 వ డివిజన్లో డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఆళ్ల మాధవ సహకారంతో మాకర్ల హరిశేషులత అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నందున వైద్య ఖర్చుల నిమిత్తం 24,001 రూపాయల చెక్కును మంగళవారం పి.వి.ఫణి కుమార్, ఆళ్ల మాధవలు, బాధిత కుటుంబానికి అందజేశారు. మచిలీపట్నం నియోజకవర్గంలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధిని మంత్రి రవీంద్ర ఇప్పించడం జరుగుతోందన్నారు. నియోజకవర్గ సంక్షేమం కోసం రవీంద్ర విశేష కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ తెలుగుదేశం పార్టీ సెక్రటరీ పామర్తి కార్తీక్ కిరణ్ లు పాల్గొన్నారు.

## వినూత్నమైన ఆలోచనలతో ముందుకు వెళ్లాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** విద్యార్థులు, యువత వినూత్నమైన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ పిలుపునిచ్చారు. మంగళవారం సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో ఏర్పాటుచేసిన లీడర్షిప్ ఎక్స్లెన్స్ అచీవ్మెంట్ ప్రోగ్రామ్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 789 ఫార్ములాను పాటించాలని, ఏడు గంటల నిద్ర, ఎనిమిది గంటల చదువు, తొమ్మిది గంటల ఇతర వ్యాపకాలు కోసం కేటాయించాలని సూచించారు.రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు మాట్లాడుతూ, భారతదేశ గొప్పదనాన్ని విదేశాల్లో చాటిన వివేకానందుని స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి,మచిలీపట్నం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఆంజనేయ కుమార్, సౌభాగ్యలక్ష్మి, సాయికృష్ణ చైతన్య తదితరులు ప్రసంగించారు. అనంతరం లీడర్షిప్ ఎక్సెలెన్స్ అచీవ్మెంట్ ప్రోగ్రామ్ పై జిల్లా సత్యసాయి సేవా సంస్థ ల అధ్యక్షులు కొమరగిరి చంద్రశేఖర్ తనదైన శైలిలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థిని విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.

## ఆదినారాయణ స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నంకు చెందిన తిరుమలశెట్టి ఆదినారాయణ 40,000 వేల రూపాయులు విలువచేసే మూడు చక్రాల విద్యుత్ ఛార్జింగ్ తో నడిచే వాహనాన్ని,జనసేన పార్టీ ఇంచార్జ్ డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ చేతుల మీదుగా జనసేన పార్టీ మచిలీపట్నం కార్యాలయంలో పెదకానూరుకు చెందిన పట్టపువెంకటస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ, తిరుమలశెట్టి ఆదినారాయణ ప్రతి ఒక్కరికి స్ఫూర్తి అని పుట్టుకతో నడవలేని విభిన్న ప్రతిభావంతుడైన పట్టపు వెంకటస్వామికి కు 40 వేల విలువైన విద్యుత్ ఛార్జింగ్ మూడు చక్రాల వాహనాన్ని అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారని తెలిపారు.సమాజంలో నిరుపేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం నుండి సహకారం అందజేస్తామని ప్రభుత్వంతోపాటు దాతలు కూడా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించడం మానవత్వానికి నిదర్శనమని బండి రామకృష్ణ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బందరు టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గడ్డం చిన్న,శివయ్య ప్రతినిధులు రాసంశెట్టి సాంబశివరావు,దాసరిశివ నాగేంద్రం, కూనసాని శివ నాంచారయ్య చలమలశెట్టి వెంకటనాగరాజు, జనసేన పార్టీ నాయకులు గడ్డం రాజు, దివి మహేశ్ పట్టపు వెంకటేశ్వరరావు, చిమట ఓంకారం, మోపిదేవి ఏడుకొండలు, పంచకర్ల శ్రీనివాస్, చలమలశెట్టి రమేష్, వాళ్లే రామినాయుడు, ఈవన మణిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ శాంతి కోసమే దివ్యజ్ఞాన సమాజం

### ప్రముఖ ఆడిటర్ సి. శేషాచార్యులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రపంచ శాంతి కోసమే భారతదేశం వ్యాప్తంగా దివ్యజ్ఞాన సమాజం కృషి చేస్తుందని ప్రముఖ ఆడిటర్ సీనియర్ సభ్యులు సి. శేషాచార్యులు (అప్పాజీ )అన్నారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర దివ్యజ్ఞాన సమాజ సదస్సుకు మచిలీపట్నం నుండి హాజరైన ఆరు సభ్యులను సన్మానించడానికి మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం మంగళవారం సాయంత్రం ఈడేపల్లి లో ని ఆల్కట్ లాడ్జ్ బిల్డింగ్ లో మచిలీపట్నం శాఖ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షతన మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆడిటర్ అప్పాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాలాతీత జ్ఞానానికి అంకితం కావాలని, నిత్యం సత్యము అనేది అంతులేని శక్తిని ఇస్తుందని అన్నారు. జిడ్డు కృష్ణమూర్తి రచనల ద్వారా ప్రతి ఒక్కరూ స్వయంకృషితో ఎదగాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మజ్ఞానం పొందాలని అప్పాజీ అన్నారు. కులాలకు మతాలకు ప్రాంతాలకి అతీతంగా ప్రతి ఒక్కరు సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని అప్పాజీ అన్నారు. దివ్యజ్ఞాన సమాజం జాతీయ స్పీకర్ విశ్రాంత అధ్యాపకులు సవరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వివిధ మతాల సర్వోన్నత సత్యాన్ని అందరూ గ్రహించాలని, అన్ని మతాల మానవ మహోన్నత విలువలను నేటి యువతరం అందించాలని అన్నారు. అందుకోసం దివిజ్ఞాన సమాజం 150 సంవత్సరాలుగా కృషి చేస్తుందని తెలియజేశారు. మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం అధ్యక్షులు న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి సదస్సులో రాజమండ్రిలో గత వారం మచిలీపట్నం నుండి ఆరుగురు సీనియర్ సభ్యులు హాజరు కావడం అభినందనీయమని అన్నారు. సమాజ మార్పు కోసం యువతలో నైతిక విలువలు పెంచడం కోసం దివ్యజ్ఞాన సమాజం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.మరో సీనియర్ సభ్యులు కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్వకాలీనమైన సత్యాన్ని తెలుసుకోవడమే దివ్యజ్ఞానం అని అన్నారు. ప్రతి ఒక్కరూ వారిలోని అంతర్గత శక్తులను తెలుసుకోవాలని అన్నారు.ద్వీజ్ఞాన సమాజం కార్యదర్శి కొత్తకొండు రమేష్ రాష్ట్ర సదస్సు కార్యక్రమాలను వివరించారు. అనంతరం గౌరవ అధ్యక్షులు అప్పాజీని రాష్ట్ర సదసు కి హాజరైన ఆరుగురు సభ్యులను మచిలీపట్నం దివ్య జ్ఞాన సమాజం సన్మానించింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఎం. సత్యనారాయణ సీనియర్ న్యాయవాది గుడిసేవ మురళి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# సహకార ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకూ పోరాటం



**చల్లపల్లి,మేజర్ న్యూస్ :** సహకార సంఘ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిం చే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని సహకార ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చం ద్ర రవికుమార్, జిల్లా అధ్యక్షులు తోట కృష్ణారావులు స్పష్టంచేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ సహకార ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం 9వ రోజుకు చేరింది. అవనిగడ్డ నియోజకవర్గంలోని 37 సొసైటీల్లోని సీఈవోలు, సిబ్బంది 130 మందికి పైగా చల్లపల్లి కేడీసీసీ బ్యాంకు ఆవరణలో మంగళవారం తమ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు రవికుమార్, కృష్ణారావులు మాట్లాడుతూ, జీవో నెం.36ను ప్రభుత్వం తక్షణం అమలుపరచాలని డిమాండ్ చేశారు. పదవీవిరమణ వయసు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. వేతన సవరణలు చేయాలనీ, అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలనీ, గ్రాట్యుటీ చట్టాన్ని అమలుపరిచి చట్టప్రకారం చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత సంఘాల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన వరకూ తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కోసూరు రామాంజనేయులు, సొసైటీల సీఈవోలు, సహకార సంఘాల్లోని ఉద్యోగులు పాల్గొన్నారు.

# వైభవంగా తాడంకి రామాలయ ప్రతిష్టా మహోత్సవాల అంకురార్పణ





**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తాడంకి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయం (గౌడ రామాలయం)లో ఆలయ, విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు నిర్వహించనున్న ఈ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం వేద పండితులు శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. త్రయాహిక దీక్షతో జరుగుతున్న ప్రతిష్టా మహోత్సవాల తొలిరోజు మంగళవారం ఉదయం మంగళవాయిద్యాల నడుమ వేదపారాయణతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ కుందుర్తి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో వేద పండితుల బృందం ప్రతిష్ట మహోత్సవ పూజలకు అంకురార్పణ చేశారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, పంచగవ్య ప్రాశనము, రక్షాబంధనము, ఆచార్య ఋత్విక్ వరణము, అఖండదీప స్థాపన, యంత్రానుష్ఠానము, గంగాపూజ, గోపూజ, లక్ష్మీ పూజ, ధాన్య పూజ వంటి పూజాక్రియలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠా మూర్తులకు లక్షణోద్ధారణం, అష్టముత్రికా స్నపనము, నేత్రోన్మీలనము, దశమహా దర్శనములు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వేద పండితులు ఉభయ దాతలు దంపతులతో ప్రతిష్ట దీక్ష పూజలు చేయించారు. మూల మూర్తులకు అభిషేక కార్యక్రమాలు పూర్తి చేశారు.

**విగ్రహాల గ్రామోత్సవం...**

మధ్యాహ్నం అంగరంగ వైభవంగా మంగళవాయిద్యాల నడుమ ప్రతిష్ఠాపన మూర్తుల గ్రామోత్సవం (ఊరేగింపు) నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్దిన వాహనంపై ప్రతిష్ట మూర్తులు, ఉత్సవమూర్తులను వేంచేసి గ్రామం వీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కోలాట బృందం, వివిధ భక్త సమాజాలు, సేవా కార్యక్రమాల నిర్వాహకులు పాల్గొని శోభాయాత్రను జయప్రదం చేశారు. వీధులలో భక్తులు స్వామివారి ఊరేగింపు వాహనానికి నీరు వారపోసి, కొబ్బరికాయలు, హారతులు సమర్పిస్తూ భక్తిభావంతో విగ్రహాలకు స్వాగతం పలికారు. ప్రతిష్ట వేడుకలలో భాగంగా సాయంత్రం గణపతి పూజ, పుణ్యావహనము, వాస్తుపూజ, వాస్తుహోమము, వాస్తుబలి, పర్యగ్నీకరణము, మృత్సంగ్రహణ, యాగశాల ప్రవేశము, అంకురారోపణము వంటి కార్యక్రమాలు జరిగాయి. తదుపరి ద్వితీయ కాల శాలార్చన, ప్రధాన వేదికార్చన, అగ్నిమధనము, అగ్నిప్రతిష్ఠాపన, ద్వాదశ పాత్రసాధన, తత్తత్ దేవతా మూలమంత్ర హవనములు, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు తొలి రోజు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవాలకు గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాలయ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



# జల్ జీవన్ మిషన్ పనులపై ప్రత్యేక దృష్టిపెట్టండి

## త్వరితగతిన పూర్తయ్యేలా కృషిచేయండి

## తాగునీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరం

## వేసవి సన్నద్ధత పకడ్బందీగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తయ్యేలా చూసి పథకం ఫలాలు ప్రజలకు చేరువయ్యేలా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా జల, పారిశుద్ధ్య మిషన్ (డీడబ్ల్యూఎస్ఎం) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జల్ జీవన్ మిషన్ – కుళాయి కనెక్షన్లలో పురోగతితో పాటు పథకం పనితీరుపై సమీక్షించారు. అదేవిధంగా స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్)– ఓడీఎఫ్ ప్లస్, ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, నిఘా తదితరాలపై చర్చించారు. ఎ.కొండూరులో మండలంలోని సీకేడీ ప్రభావిత ప్రాంతాల్లో ఇంటి కుళాయి కనెక్షన్ల భౌతిక స్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. 100 శాతం కనెక్షన్లు కల్పించేందుకు డీపీవోకు ఆదేశాలిచ్చారు. గొల్లమండల తండా, జమలగడ్డ, దీప్లానగర్ ఆవాసాలకు అవసరమైన క్లియర్ వాటర్ సంప్ నిర్మాణం పూర్తిచేసి



మార్చి నాటికి తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. వేసవిలో ఎక్కడా తాగునీటికి కొరత లేకుండా పకడ్బందీ ప్రణాళికలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నిరంతర నాణ్యమైన తాగునీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. షెడ్యూల్ ప్రకారం చేతి పంపులు, బోర్‌వెల్స్ మరమ్మతులు, పైపులైన్ల లీకేజీల నివారణ, కలుషిత నివారణ వంటి వాటి పనులు జరిగేలా చూడాలన్నారు. ఆరోగ్యం, విద్య, మహిళా & శిశు సంక్షేమ శాఖలతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో తాగునీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాల సాధనలో స్వచ్ఛమైన తాగునీటి సరఫరా కూడా కీలక అంశమని.. ఈ నేపథ్యంలో నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థను పకడ్బందీగా అమలుచేయాలని స్పష్టం చేశారు. మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దిష్ట కాలపరిమితుల్లో నీటి వనరుల శాంపిళ్లను పరీక్షించి, ఫలితాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. పీహెచ్, టీడీఎస్, హార్డ్‌నెస్, ఫ్లోరైడ్, ఐరన్, నైట్రేట్ వంటి వాటితో పాటు భౌతిక, రసాయన, బ్యాక్టీరియాలజికల్ పరామితులపై దృష్టిసారించాలన్నారు. క్లోరినేషన్‌తో పాటు పాఠశాలలు, అంగన్వాడీలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, హాస్టళ్లు వంటి వాటిలో ట్యాంకుల శుద్ధి సరైన విధంగా జరిగేలా సమన్వయ శాఖల అధికారుల పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎ.రామకృష్ణారావు, డీపీవో పి.లావణ్యకుమారి, డ్వామా పీడీ ఎ.రాము, వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, విద్య, వైద్యం, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులందరికీ చదవడం, రాయడం పూర్తిగా రావాలి

## పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోవడం ద్వారా బలోపేతం చేయాలి

## కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి



**పామర్రు మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికిచదవడం, రాయడం పూర్తిగా రావాలని విద్యాశాఖ కాకినాడ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి సూచించారు. పామర్రు లోని ప్రగతి విద్యా సంస్థల ప్రాంగణంలో విద్యాశాఖ జోన్ 2 పరిధిలో గల ఐదు జిల్లాల ఎంఈఓ – 1, 2లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం జి.ఎఫ్.ఎల్.ఎన్ కార్యక్రమంలో భాగంగా 75 రోజుల ప్రణాళికలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం ఒకటి నుండి 5వ తరగతి విద్యార్థులు ప్రతి ఒక్కరికి చదవడం, రాయడం, అలాగే లెక్కలు చేయడం పూర్తిస్థాయిలో రావాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి ప్రాథమిక దశలో చదవడం, రాయడం వస్తే పునాది బాగా ఉంటుందని, తద్వారా పై తరగతులలో సులభంగా ఉత్తీర్ణులు కాగలరని ఆమె పేర్కొన్నారు. అంతేకాక వారికి ఇక్కడ వేసే పునాది భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారా పాఠశాలలను బలోపేతం చేయాలని ఆమె సూచించారు. రానున్న కాలంలో ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలు విద్యను ఉన్నతంగా అందిస్తాయనే భరోసాను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డిసెంబర్ 8వ తేదీన ప్రారంభమైన 75 రోజుల ప్రణాళిక మార్చి 24వ తేదీతో ముగుస్తుందన్నారు. ఇప్పటికే సగం రోజులకు పైగా ఈ కార్యక్రమం పూర్తయినందున ఇప్పటివరకు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతి ఏ విధంగా ఉందనే అంశంపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు, అంగలూరు డైట్ కళాశాల అధ్యాపకుడు లక్ష్మీనారాయణ, ఉయ్యూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిణి ఐ.పద్మరాణి, పామర్రు మండల విద్యాశాఖ అధికారులు –1,2 ఎ.భానుప్రకాష్, జి.పద్మవాణి, ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ సనకా పూర్ణచంద్రరావు, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల ఎ.ఎం.ఓ లు శ్యామ్, అశోక్ తదితరులు పాల్గొనగా, ఈ శిక్షణకు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన మండల విద్యాశాఖ అధికారులు దాదాపు 280 మంది పాల్గొన్నారు.

# కొండపల్లి 24వ వార్డులో డ్రైనేజ్ సమస్యపై కౌన్సిలర్ వెంటనే స్పందన





**కొండపల్లి మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీ 24వ వార్డులో డ్రైనేజీ నీరు రోడ్డుపైకి వస్తుందంటూ సమాచారం అందుకున్న వెంటనే కౌన్సిలర్ పులి అరుణ్ కుమారి దాస్ చర్యలోకి దిగారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ వెంటనే మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబుకి నివేదించారు. అదే సమయంలో రాత్రి ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం కారణంగా వర్షపు నీరు, ట్రైన్‌డ్రైనేజ్ వాటర్ కలిసి రోడ్డుపైకి చేరడంతో సమస్య మరింత తీవ్రంగా మారింది.ఆ పరిస్థితిని వ్యక్తిగతంగా పరిశీలించేందుకు మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, 24 వార్డ్ కౌన్సిలర్ పులి అరుణ్ కుమారి దాస్ చేరుకుని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. వెంటనే మున్సిపల్ కార్మికులతో అత్యవసర డ్రైనేజ్ పూడికతీత పనులను చేపట్టించి, రోడ్డుపైకి వచ్చిన నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు.ప్రతి భారీ వర్షం సమయంలో ఈ ప్రాంతంలో డ్రైనేజ్ ఓవర్‌ఫ్లో సమస్య చోటుచేసుకుంటోందని స్థానికులు చెప్పిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నట్లు చైర్మన్ వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలనే సూచనలను కౌన్సిలర్ అరుణ్ కుమారి దాస్ చైర్మన్‌కు వివరించారు.మున్సిపల్ చైర్మన్ దిశానిర్దేశం మేరకు వెంటనే స్పందించిన మున్సిపల్ సిబ్బంది నీటిని తొలగించడంతో స్థానిక ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.



## ఘంటా నేతాజీ వర్ధంతికి విద్యార్థులకు పలకలు, పుస్తకాల పంపిణీ

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ప్రముఖ రైతునేత ఘంటా నేతాజీ వర్ధంతి సందర్భంగా గుడ్లవల్లేరు శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులందరికి వారి కుటుంబసభ్యుల సహకారంతో పలకలు, పుస్తకాలు, బిస్కట్లు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేతాజీ కుమారుడు కృష్ణప్రసాద్, శ్రీసాయి విద్యా నికేతన్ కరస్పాండెంట్ సింగంశెట్టి ఆదినారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 28నే పెన్షన్ పంపిణీ



**మొవ్వ మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఫిబ్రవరి నెలకు సంబంధించన మండలంలో 8,315మంది లబ్ధిదారులకు ఈనెల 28వ తేదీనే పంపిణీ చేయానున్నట్టు ఎంపీడీఓ డి. సుహాసిని తెలిపారు. మండలంలోని 16 సచివాలయాల్లో194 మంది సిబ్బందితో లబ్ధిదారులకు 3,59,683,500 రూపాయలను అందజేయనున్నామన్నారు. మార్చి 1వ తేదీ ఆదివారం వారాంతపు సెలవు కావడంతో ప్రతి నెల పెన్షన్ పంపిణీ చేసే ప్రభుత్వ ఉద్యోగులతో ఈనెల ఒకరోజు ముందుగానే అందజేయనున్నామని వివరించారు. అదేరోజు పంపిణీ జరగని పెన్షన్లు మార్చి 2వ తేదీ సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సుహాసిని తెలిపారు. కొత్త పెన్షన్లపైసోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలు నమ్మవద్దని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు కోసం దరఖాస్తులను స్వర్ణ గ్రామం.–స్వర్ణ వార్డు పేరిట దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చంటూసోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలపై ఎంపీడీఓ సుహాసిని ఖండిస్తూ ఇప్పటి వరకు కొత్త పింఛన్ల కోసం సంబంధించిన యాప్ ప్రారంభం కాలేదని వివరించారు. అనధికార ప్రచారాలను ఆశావాహులు నమ్మవద్దని పేర్కొన్నారు. ప్రభుత్వం జీవో విడుదల చేయగానే సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, పంచాయతీల ద్వారా తెలియపరుస్తామని వివరించారు.

## మొవ్వ పరీక్షా కేంద్రంలో 6గురు గైర్హాజరు



**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన మొవ్వ శ్రీక్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు 186 మంది విద్యార్థులకుగాను 6గురు విద్యార్థులు గైర హాజరు కాగా180 మంది పరీక్షలు రాశారని డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ఎం. ఆది విష్ణు తెలిపారు.. ఈ పరీక్షకు సిటింగ్ స్క్వాడ్ ప్రతినిధిగా కృష్ణా జిల్లా లోని రుద్రపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అధ్యాపకులు నిర్మల కుమార్ హాజరై తనిఖీలు నిర్వహించారు.

## పర్యావరణ పరిరక్షణకు ఈ - సైకిళ్లు దోహదం



**పామర్రు మేజర్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణకు ఈ– సైకిళ్ళు దోహదపడతాయని తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ పేర్కొన్నారు. పామర్రులోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ఎలక్ట్రిక్ సైకిళ్ళ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో శ్రమలేని ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం మహిళలకు ఎలక్ట్రిక్ సైకిళ్ళను అందజేస్తోందన్నారు. ఒక్కొక్క సైకిల్ ధర 35 వేల రూపాయలు కాగా 11 వేల రూపాయల సబ్సిడీతో మహిళలకు ఈ సైకిళ్ళను అందిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని 25 మంది మహిళలకు ఈ ఎలక్ట్రిక్ సైకిళ్ళను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, వెలుగు ఎపిఎం సిహెచ్.తిరుపతయ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## రంజాన్ సందర్భంగా అరబ్బీ మదరసాకు సహాయం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** రంజాన్ సందర్భంగా దాతలు అరబ్బీ మదరసాకు సహాయం చేయటం ముదావహం అని టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షులు మహమ్మద్ హఫీజుర్ రెహమాన్ (ఏసి బాబు) అన్నారు. మంగళవారం చల్లపల్లిలోని అరబ్బీ మదరసాకు మచిలీపట్నంకు చెందిన స్టేట్ మైనారిటీ కార్పోరేషన్ డైరెక్టర్ హసీం బేగ్ చొరవతో స్టార్ విద్యాసంస్థల విద్యార్థుల సహకారంతో రూ.15 వేలు విలువైన 150 కిలోల బియ్యం, ఇరవై కిలోల కందిపప్పు, 15లీటర్ల ఆయిల్ అందచేశారు. రంజాన్ ఉపవాసదీక్షల సందర్భంగా మదరసా విద్యార్థులకు దాతలు సహాయం చేయటం అభినందనీయమన్నారు. దాతల సహాయం పట్ల మదరసా నిర్వాహకులు, ఖురాన్ గురువులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, కోఆప్షన్ సభ్యుడు షేక్ నబీఘోరి, ఏఎంసీ డైరెక్టర్ షేక్ ఇబ్రహీం, అమీర్ జాని తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెహెర్ బాబా 132వ జయంతి ఉత్సవం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** మానవునికి ముక్తిమార్గాలను ప్రభోధించిన అవతార్ మెహెర్ బాబా 132వ జయంతి ఉత్సవం బుధవారం చల్లపల్లిలో జరుగనుంది. చల్లపల్లి ఆర్అండ్ బంగ్లా సమీపంలో 60 సంవత్సరాల క్రితం 1965 లో అవతార్ మెహెర్ బాబా సెంటరును స్థాపించి నాటి నుంచీ బాబావారి జయంతి ఉత్సవాలు నిర్వహించటంతో పాటు బాబా అమరతిథి, పాదుకా ఉత్సవం, ప్రతి ఆదివారం ప్రత్యేక ప్రార్ధనలు తదితర కార్యక్రమాలు చేస్తున్నారు. 132వ జయంతి మహోత్సవాలు ఈనెల ఒకటవ తేదీన ప్రారంభమయ్యాయి. 25వ తేదీ ఉదయం సంకీర్తన, అవతారుని జనన సమయమున హారతి, మధ్యాహ్నం ప్రేమవిందు, సాయంత్రం మహిళలచే పేరంటము, ఉయ్యాల, హారతి, రాత్రికి గ్రామపురవీధుల్లో ఊరేగింపు ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## మహిళల పోషకాహారంపై శిక్షణ



**మొవ్వ మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల వారి అధ్వర్యంలో మండల పరిధిలోని పద్దారాయుడు తోట గ్రామంలోమహిళలకు పోషకాహారం యొక్క ప్రాముఖ్యత పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కె.వి.కె సమన్వయ కర్త డా. డి. సుధారాణి రోజువారీ ఆహారం లో పోషకాహారం ప్రాముఖ్యతను వివరించి, పోషకాహార లోపం రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి. కృష్ణవేణి శరీరానికి అవసరమైన పిండిపదార్థాలు, మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థం సమృద్ధిగా ఉండే ఆహారాన్ని దైనందిత జీవితం లో బాగంగా చేసుకోవాలని కోరారు. సమతుల ఆహారాన్ని తీసుకోవడం వలన రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమం లోగుర్రపుడెక్క తోటఉత్పతుల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో పద్దరాయుడుతోట గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగిన అంగన్వాడి రిలే దీక్షలు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** సమస్యలు పరిష్కారం కోరుతూ ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (సిఐటియు) పిలుపుమేరకు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ప్రాజెక్ట్ ఏరియాలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొని తమ డిమాండ్లు పరిష్కారం చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఏరియా అధ్యక్షురాలు ఎం.నిర్మల జ్యోతి, కార్యదర్శి అన్నపురెడ్డి. నాగమణి, సెక్టార్ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన ర్యాలీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ఆదేశానుసారం, ఎన్టీఆర్ జిల్లా రూరల్ డిసిపి బి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో, మైలవరం ఏసీబీ వై ప్రసాద్ రావు ఆధ్వర్యంలో జి కొండూరు పోలీసు వారు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం 9 గంటలకు కట్టుబడిపాలెం, విద్యానగరం, పినపాక, జి కొండూరు గ్రామాల్లో హెల్మెట్ పై అవగాహన బైక్ ర్యాలీను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైలవరం ఏసిపి వై ప్రసాద్ రావు, మైలవరం సీఐ డీ చంద్రశేఖర్, జి కొండూరు ఎస్ఐ కే సతీష్ కుమార్, పోలీస్ సిబ్బంది ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, కట్టుబడిపాలెం గ్రామ టీడీపీ నాయకులు, ప్రజలు హెల్మెట్లు ను ధరించి సుమారు 50 మంది వరకు ఈ బైక్ ర్యాలీలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ వై ప్రసాద్ రావు ప్రజలకు అవగాహన కల్పిస్తూ, టూ వీలర్ పై ప్రయాణించేవారు తప్పక హెల్మెట్లు ధరించాలని, హెల్మెట్లు ధరించకపోవడం వల్ల ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలు అయ్యి అనేకమంది చనిపోతూ, అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, కావున ప్రజలందరూ అవగాహనతో మెలిగి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. హెల్మెట్ లేకుండా రోడ్డు పైకి రావద్దు.తాగి బండి నడపొద్దు అని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటుందని హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, తాగి బండి నడపడం, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వడం, అధిక వేగం మొదలైనటువంటి ప్రమాదాల కారణం అవుతున్న వాహనదారుల నిర్లక్ష్య చర్యల పట్ల పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలియపరిచారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలంతా సహకరిస్తూ నిర్లక్ష్య వైఖరిని వీడి అవగాహనతో మెలిగి రోడ్డు నియమాలు పాటించాలని కోరారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో ఒలంపియాడ్ పరీక్షకు సంబంధించి చెక్కుల పంపిణీ



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** రామానగరంకు చెందిన శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని విద్యార్థులు నవంబర్ 9వ తేదీ మచిలీపట్నంలో నాలెడ్జ్ అసైన్మెంట్ టెస్ట్ ఒలంపియాడ్‌కు జరిగిన పరీక్ష కు 64 మంది విద్యార్థులు హాజరవగా 7 గురు విద్యార్థులకు రూ 2000 6గురు విద్యార్థులకు రూ.1000 చొప్పున క్యాష్ అవార్డ్స్ గెలుపొందారు. ఈ రోజు స్కూల్ లో అభినందన సభ నిర్వహించి ఆ విద్యార్థులకు చెక్కులతో పాటుగా గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్స్ విద్యార్థులకు అందజేశారు. సబ్జెక్టుల వారీగా మ్యాథ్స్ లో 20 మందికి, ఫిజిక్స్‌లో 13 మందికి, కెమిస్ట్రీ లో 20 మందికి మొత్తం 53 మందికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ మద్దినేని మురళీ కృష్ణ, రీజినల్ ఇన్చార్జి రాజేష్ బాబు, స్కూల్ ప్రిన్సిపాల్ డి.సురేష్,టెక్నో డీన్ టి. రమ్య, సి బ్యాచ్ ఇన్చార్జి రవి కుమార్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పామర్రు పోలీసుల వినూత్న ఆలోచన



**పామర్రు మేజర్ న్యూస్:** ప్రజలలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పామర్రు పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డు ప్రమాదాల తీవ్రతను ప్రత్యక్షంగా చూపించేందుకు ప్రమాదానికి గురైన దెబ్బతిన్న కారును ప్రధాన రహదారిపై ప్రదర్శనకు ఉంచారు. "ఒక క్షణం నిర్లక్ష్యం ఒక కుటుంబాన్ని నాశనం చేస్తుంది" అనే సందేశంతో వాహనదారులకు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. అధిక వేగం, మద్యం సేవించి డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు



తెలిపారు. ప్రతి ఒక్క రూ ట్రాఫిక్ నిబంధనలు పాటిం చి, సురక్షితంగా ప్రయాణిం చాలని విజ్ఞప్తి చేశారు. పామర్రు సిఐ వి.శుభాకర్, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, ఎస్ఐ -2 జి.విజయ భాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగిన అంగన్వాడీ రిలే దీక్షలు



**గన్నవరం, ఫిబ్రవరి 24, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ బి.తాతబ్బాయి డిమాండ్ చేశారు. ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా గన్నవరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం రెండవ రోజు అంగన్వాడీ కార్యకర్తలు దీక్ష నిర్వహించారు. ఈ దీక్ష సందర్భంగా తాతబ్బాయి మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో 42 రోజుల నిరవధిక సమ్మె తరహాలో మరో పోరాటానికి అంగన్వాడీ లు సిద్దంగా ఉన్నారని. ప్రభుత్వ హామీ మేరకు సానుకూలంగా అంగన్వాడీ లతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. పరిష్కారం చూపకుండా తాత్సారం చేస్తే పోరాటం ఉధృత రూపం దాల్చుతుంది అని అన్నారు. ప్రాజెక్ట్ నాయకురాలు రమాదేవి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులతో సానుకూలంగా చర్చలు జరిపి పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

## ఔట్సోర్సింగ్ లస్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కృష్ణా డెల్టాలోని జల వనరుల శాఖ ఔట్ సోర్సింగ్ లస్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. మంగళవారం స్థానిక ఎమ్ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ను కలిసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తమకు ఏడాదిలో 8–10 నెలలు కాకుండా 12నెలలకూ జీతాలు ఇవ్వాలని కోరారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా తమ జీతాలు పెంచాలని కోరారు. ప్రభుత్వం జీతాలు సకాలంలో ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రంలో కోరారు.

# 26 నుంచి శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారి కళ్యాణ మహోత్సవ వేడుకలు



**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల 263వ వార్షిక కళ్యాణ మహోత్సవ వేడుకలు ఈనెల 26వ తేది గురువారం నుంచి మార్చి 4వతేదీ వరకు నిర్వహిచనున్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి తెలిపింది. త్రయాహ్నిక దీక్షతో వైదిక రత్న శతాధికప్రతిష్టాచార్యులు పూర్వ దీక్షాపరులు బ్రహ్మశ్రీ రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి పర్యవేక్షణలో నిర్వహించే వారం రోజులు వేడుకలలో శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం చింతలపాటి రామకృష్ణ, అలంకారములు అర్చక స్వాములైన పెనుమూడి సతీష్ కుమార్ పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ బృందం, మంగళవాయిద్యములు మోపిదేవి సాంబశివరావు, మద్దిరాలరమేష్ బృందం నిర్వహిస్తారని కమిటీ పేర్కొంది. కళ్యాణ వేడుకల కోసం దేవాలయం రంగురంగుల రంగవల్లులతోటతో,చలవ పందిళ్లతోముస్తాబుచేశారు. మార్చి1వతేది రాత్రికి కళ్యాణ వేడుకలను శాశ్వత ఉభయ దాతలు ఏలేశ్వరపు వెంకటరమణమూర్తి– శైలజ దంపతులు కుటుంబ సభ్యులతో కలసి నిర్వహిస్తారు. అదే రోజు జగజ్యోతికార్యక్రమాన్ని భాగవతుల వెంకట సత్య సీతారామ శర్మ–లక్ష్మీ కనకదుర్గ (హైదరాబాద్) దంపతులు నిర్వహిస్తారు. కళ్యాణవేడుకలలోనే భాగంగా నాట్య లెజెండ్ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగనున్నాయని ధర్మకర్తల మండలి తెలిపింది.

# విజయవాడ అభివృద్ధే మా లక్ష్యం

- నగర అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం
- గ్రేటర్ విజయవాడ కాకముందే నగర సమస్యలు పరిష్కరిస్తాం
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమీక్ష






**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నగరాభివృద్ధిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ వర్షాకాలం దృశ్య, నగరంలో వర్షపు నీరు రోడ్డుపైన నిల్వ ఉండకుండా స్టాంమ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు విజయవాడ నగర పాలక సంస్థ వారు తయారుచేసిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) సమీక్షించారు. అందులో భాగంగా ప్రస్తుతం పంట కాలువ డ్రైన్ 2.5 మీటర్లు ఉండగా ప్రస్తుత డిపిఆర్ ప్రకారం 8 మీటర్లకు వెడల్పు పెంచడం వల్ల వర్షపు నీరు నగరంలో నిలవ ఉండకుండా ప్రవహించేటట్టు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరంలో ఇంకాను వర్షపు నీటి డ్రైన్‌ల నిర్మాణం ఎక్కడైతే అసంపూర్తిగా ఉన్నాయో వాటిని పూర్తి చేసేటట్టుగా, ముఖ్యంగా కొండ ప్రాంతాలలో వర్షపునీటి నిలువల సమస్య లేకుండా ఈ డ్రైన్లు నిర్మించే విధంగా డిపిఆర్ తయారు చేశామని అన్నారు. ముఖ్యంగా జక్కంపూడి, అంబాపురం, గొల్లపూడి, డ్రైన్లు నగర పరిధిలో ఎక్కడైనా కలుస్తుందా అన్న విషయాన్ని గమనించమన్నారు. నగరంలో అతి ముఖ్యమైన తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు త్వరలో ఒక డి పి ఆర్ ని తయారు చేసి ఎంపీకి ఇవ్వాలని అన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు నగరంలోని ముఖ్యమైన పార్కులకు ఎంపీ నిధులతో మరింత అభివృద్ధి చేయాలని దానికి ఏ పార్కులకు ఎటువంటి అవసరాలు ఉన్నాయో ఒక నివేదికను సమర్పించాలని అన్నారు. వాడుకనీరును శుద్ధి చేసే మినీ సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు నగరంలో నిర్మించాలని అన్నారు. నగరంలో ఫుడ్ కోర్ట్ ల సంఖ్యను పెంచాలని కృష్ణలంక ప్రాంతంలో ఒక ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నగర సుందరీకరణకు సర్కిళ్లు, ఐలాండ్ లు జంక్షన్లు అభివృద్ధి చేయాలని అన్నారు. నగరంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు దూరం చేసే విధంగా కొత్త బ్రిడ్జ్ లకు ప్రణాళికలు సిద్ధం చేయాలి అని అన్నారు. అందులో రైల్వే, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి సమన్వయంతో ప్రజల సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ పార్కుల అభివృద్ధికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని, మంచినీటి పైప్లైన్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పై డి పి ఆర్ ను మార్చ్ నెలకల్లా అందిస్తామని, నగరంలో బ్రిడ్జి ల నిర్మాణ విషయంలో రైల్వే, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే శాఖల సమన్వయంతో నగరపాలక సంస్థకు భారం తగ్గుతుందని, కృష్ణలంక ప్రాంతంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలనే ఆలోచన పై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్ మీరా, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జ్) పి.సత్యకుమారి, సూపర్ ఇండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) వి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె శ్రీనివాస్ ఏ శ్రీనివాసరెడ్డి జి సామ్రాజ్యం సురేఖ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# పన్నులు సజావుగా వసూలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలి





**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల నుండి వస్తు సేవల పన్నులు సజావుగా వసూలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో వాణిజ్య పన్నుల వసూలుపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ఆస్తులు, భూముల క్రయవిక్రయాలు జరిగినప్పుడు అందుకు సంబంధించిన వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. తప్పనిసరిగా వస్తు సేవల పన్నులు వసూలు అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత వ్యక్తులకు సంబంధించి బ్యాంకు వివరాలను కూడా వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. పట్టణాలలో గాని గ్రామ పంచాయితీలలో గాని ప్రభుత్వం చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్ లు తప్పనిసరిగా వస్తు సేవల పన్ను చెల్లించాల్సి ఉంటుందని అటువంటి వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. అలాగే పౌర సరఫరాలు, తూనికలు కొలతలు, గనులు భూగర్భ శాఖల అధికారులు టాస్క్ ఫోర్స్ ఏర్పాటై ఉమ్మడిగా వాహనాలను తనిఖీ చేసి వస్తు సేవల పన్ను వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో కూడా వృత్తి పన్ను వసూలు చేస్తున్నారా లేదా విచారించి అందుకు సంబంధించిన వివరాలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ జి కల్పన, అదనపు ఎస్పీ వి నాయుడు, వాణిజ్య పనుల శాఖ సహాయ కమిషనర్లు సౌమ్య, జగదీష్, రాజకుమార్, డిపిఓ డాక్టర్ జె అరుణ, డిఎస్ఓ మోహన్ బాబు జెడ్పి డిప్యూటీ సీఎం సిఈఓ ఆనంద్ కుమార్ జిల్లా ఆడిట్ అధికారి సూర్య ప్రకాష్ రావు జిల్లా రిజిస్ట్రార్ గోపాలకృష్ణ గనులు భూగర్భ శాఖ ఏజీ కొండారెడ్డి మచిలీపట్నం తాడిగడప ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, నజీర్, రామారావు వాణిజ్య పన్నుల శాఖ డిఏసి చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## పేదలకు ఇళ్ళు, చర్మకారులకు
## రుణాల మంజూరుకు ఎంపిడిఓకు వినతి

**గుడ్లవల్లేరు ఫిబ్రవరి 24 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అర్హులైన వారికి పెన్షన్ మంజూరు చేయాలని, ఇల్లు లేని వారిని గుర్తించి ఇల్లు, ఇళ్ల స్థలము ఏర్పాటు చేయాలని కోరుతూ కృష్ణాజిల్లా ఎస్సీ ఎస్టీ చర్మకారుల పరిరక్ష సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుల్లా కింగ్ మంగళవారం గుడ్లవల్లేరు మండల అభివృద్ధి అధికారి ఎండి ఇమ్రాన్, హౌసింగ్ ఏఈ సురేంద్ర లకు వినతిపత్రం సమర్పించారు. అలాగే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి లిడ్ క్యాబ్ 200 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిని ఎస్సీ ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ బుల్ల రాజారావు మండల అభివృద్ధి అధికారికి చేసారు. మండలంలో దళిత మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాదిగ బిడ్డలు అర్హులైన వారిని డప్పు కళాకారులు, చర్మ కళాకారులు, చెప్పులు కుట్టేవారిని మండలంలో గుర్తించి లిడ్కాప్ ద్వారా ఒక్క మనిషికి 2లక్ష రూపాయలు లోన్స్ రూపంలో ఇవ్వాలని కోరుతూ మండలం అభివృద్ధి అధికారికి వినతి పత్రం ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

# క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన





**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కురుమద్దాలి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నివారణ చాలా సులభమని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ఎచ్.ఓ.డి కృష్ణ ప్రసాద్ వెల్లడించారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా పేదలకు ఉచితగా సేవలను అందించడం తోపాటు గ్రామీణ ప్రాంతాలలో ఉచిత నిర్ధారణ శిబిరాలను నిర్వహిస్తున్నామని కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ ఫౌండేషన్, గ్రామంలోని కొసరాజు పౌండేషన్, కాకతీయ కమ్యూనిటీ పౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో కొసరాజు పూర్ణచంద్రరావు ఆడిటోరియంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 150 మందికి పైగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. క్యాన్సర్ ఆసుపత్రికి చెందిన వైద్యులు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ స్వర్ణకుమారి, డాక్టర్ మన్విత, డాక్టర్ శరత్, నర్సింగ్ సిబ్బంది, టెక్నీషియన్లు పాల్గొని పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కొసరాజు రాంబాబు, స్వప్న ల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోదరుడు వర్ల చైతన్య, కాకతీయ పౌండేషన్ చైర్మన్ గూడూరు సత్య నారాయణ, పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, గ్రామసర్పంచ్ జి.భారతి తదితరులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999